## నాణ్యతమైన ఆహారంతోనే మెరుగైన జీవనం సాధ్యం




3లో

PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## గిరివాణి, ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 100 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 07 ఏప్రిల్ 2026

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

భూమి నుంచి రికార్డు దూరంలో

1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం

10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు



2లో

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

త్వరలో ముసాయిదాపై స్పందిస్తాం : ఇరాన్

హార్ముజ్‌పై గుత్తాధిపత్య శకం ముగిసిందని స్పష్టీకరణ

ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి

తాజా భీకర దాడుల్లో 34 మందికి పైగా మరణం

అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరపం : ఇరాన్



2లో

# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

- పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మిగతా2లో...

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

**తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**

**బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి**

**ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన**

**త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు**

**పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి**

**పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**



**ఆదిలాబాద్,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి మిగతా2లో...

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

**ఆనాటి నేతలు...నేటి మోడీతో మరింత బలోపేతం**

**47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్**



**అమరావతి,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మిగతా2లో...



# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

- అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా మిగతా2లో...

# హామీలను అమలు చేసిన ఘనత మాది

- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం
- మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క



**ఆదిలాబాద్,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్ల మిగతా2లో...

# భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్




**హైదరాబాద్,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):**భారతీయ యువత కేవలం ఉద్యోగాల కోసం వెతికేవారుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా మారి ఉద్యోగాలను సృష్టించేవారుగా ఎదగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.భారత్ ఆర్థిక గమనం, కృత్రిమ మేధ, వ్యవస్థాపకత, మారుతున్న ఉద్యోగ రంగాలపై తన లోతైన విశ్లేషణలను విద్యార్థులతో పంచుకున్నారు. న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం ప్రత్యేక చర్చ గోష్టిలో కేటీఆర్ పాల్గొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలు, భారతదేశ ప్రగతి, నిరుద్యోగం, యువత, గెలుపు ఓటముల వంటి అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.గడిచిన దశాబ్ద కాలంలో భారత్ భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. 3జీ, 4జీ, 5జీ వంటి టెలికాం సాంకేతికతలను భారత్ ప్రపంచ దేశాల కంటే ముందుగానే అందిపుచ్చుకుందని గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు భారత్ ఒక కీలక దశలో ఉందని, ఇతర దేశాల అభివృద్ధి నమూనాలను యథాతథంగా కాపీ కొట్టే పరిస్థితి లేదని అన్నారు. సొంతంగా, వినూత్నంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.ఏఐ ముప్పు పొంచి ఉంది..ఏఐ ముప్పు పొంచి ఉందని, అప్రమత్తత అవసరమని కేటీఆర్ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెను మార్పులు తీసుకురాబోతోందని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ వల్ల రాబోయే రోజుల్లో మిలియన్ల కొద్దీ ఉద్యోగాలు ప్రభావితమవుతాయి. ఈ ముప్పు వాస్తవం. చాలా దగ్గరలో ఉంది. ఈ మార్పును తట్టుకోవ డానికి ప్రభుత్వాలు కానీ, సమాజం కానీ ఇంకా సిద్ధంగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విప్లవాన్ని తట్టుకోవాలంటే యువత నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. తాజాగా ఒరాకిల్ సంస్థ భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించిన అంశాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.హైదరాబాద్ తరహా ఇన్నోవేషన్ హబ్‌లు కావాలి..స్టార్టప్ వ్యవస్థ గురించి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఒక ఉదాహరణగా కేటీఆర్ చూపారు. మిగతా2లో...

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు**

**రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎన్ మాధవ్**

**పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు**





2లో

# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళాలో సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళాను నిర్వహించారు. ఈట్ రైట్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెంటర్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మి÷-లలెట్లతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలెట్స్‌తో తయారు చేసిన ఐస్ క్రీమ్, కాఫీ, తదితర పదార్థాలను మంత్రి రుచి చూసి, తయారీ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు, కాయగూరలు, మసాల దినుసులు, చిరుధాన్యాలు, టీ పౌడర్ , పప్పు దినుసుల్లో కల్తీని ఎలా గుర్తించాలో మిగతా2లో...



# తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

- 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు

**చెన్నై,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్,

మిగతా2లో...

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విజయవాడ,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

(మొదటి పేజీ తరువాయి)

భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇంక్యుబేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు, మెంటార్ల ప్రోత్సాహం వల్లనే హైదరాబాద్ నుంచి అనేక 'యూనికార్న్' సంస్థలు పుట్టుకొచ్చాయని వివరించారు. దేశంలో వ్యవస్థాపకత పెరగాలంటే కేవలం పథకాలు ఉంటే సరిపోదని, ఒక పటిష్టమైన 'ఎకో సిస్టమ్' అవసరమని అభిప్రాయపడ్డారు.భారతదేశంలో ఉన్న యువ జనాభా ఒక శక్తి అని, అయితే అదే సమయంలో అది ఒక సవాలు అని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే కేవలం అవకాశాలు కల్పిస్తే సరిపోదని, సరైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు.

పెద్దగా కలలు కనండి, చిన్న విజయాలకు ఎప్పుడూ సంతృప్తి చెందకండని పిలుపు నిచ్చారు. జీవితంలో ఓటమికి భయపడవలసిన అవసరం లేదని, వైఫల్యం అనేది గెలుపు దిశగా సాగి ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని స్ఫూర్తిని నింపారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధైర్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు .ఈ కార్యక్రమంలో కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు, మేధావులు, ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్ పలు అంశాల పైన చెప్పిన అభిప్రాయాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

తెలుపుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల్లో జరిగిన కల్తీని ఎలా గుర్తించాలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మంత్రికి వివరించారు. ఆయా పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్ప పువ్వుతో లడ్డులు, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి.. సక్సెస్‌ఫుల్‌గా బిజినెస్ రన్ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. స్టాళ్ల సందర్శన అనంతరం జరిగిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు మంత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు హైజీన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ - న్యూట్రీషియస్ ఫుడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, మనం తింటున్న ఆహార నాణ్యత గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. 'మంచి ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకోవడానికి ఈట్ రైట్ మేళా వంటి కార్యక్రమాలు ఇందుకు ఎంతో దోహదపడుతాయి. ఆరోగ్యం బాగున్నప్పుడే, జీవితం ఆనందంగా ఉంటుందన్న విషయాన్ని బిజీ లైఫ్‌లో పడి మనం మర్చిపోతున్నాం. డబ్బు, ఉద్యోగం, సౌకర్యాలు అన్నీ ఉన్నా? ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదు. ఇటీవలి కాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోయాయి. బయట ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగింది. దీంతో పాటు, శారీరక శ్రమ, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. రోజూ కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం చాలా అవసరం. వాకింగ్, యోగా, గేమ్స్... ఏదైనా ఒకటి మన నిత్య జీవితంలో భాగం కావాలి. శరీరం కదిలితేనే ఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమైనది.ఈ పరిస్థితుల్లో, 'ఈట్ రైట్' అనే భావన చాలా కీలకం. మనము తినే ఆహారమే, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి, ఏం తినాలో, ఎక్కడ తినాలో ప్రజలు తెలుసుకోవాలి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినడం మంచిది. ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలి, మనసుకు ప్రశాంతత కలిగించే జీవనశైలిని అలవరచుకోవాలి. ఆహార కల్తీ జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే, వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. తక్షణమే కఠిన చర్యలు తీసుకునే బాధ్యత మాది.' అని మంత్రి ప్రజలకు సూచించారు.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

(మొదటి పేజీ తరువాయి)



పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**న్యూయార్క్ ,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):**అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

**టెహ్రాన్,ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):**పశ్చిమాసియాలో దాదాపు నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించేందుకు ఇరాన్ సుముఖంగా లేదని ఓ సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని ఆయన సోమవారం వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హార్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. కాగా రెండంచెల ముసాయిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరుపక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరగవని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె స్పష్టం చేశారు. ఓ పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయని, వాటిని ఇప్పటికే మధ్యవర్తుల ద్వారా తెలియజేశామని అన్నారు. అయితే ఇవి మితిమీరి ఉన్నాయంటూ అమెరికా పంపిన 15పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ఇప్పటికే తిరస్కరించిందని తెలిపారు. చట్టబద్ధమైన తమ డిమాండ్లను స్పష్టంగా వివరించడంలో ఇరాన్ వెనుకాడబోదని అన్నారు. ఆ విధంగా చేయడాన్ని రాజీ సంకేతంగా భాష్యం చెప్పరాదని అన్నారు. దానికన్నా తమ వైఖరులను నిర్వచించడంలో తమ విశ్వాసాన్ని వ్యక్తీకరించడంగా చూడాలని తెలిపారు. త్వరలో మా స్పందనలు తెలియపరుస్తాం, వివరాలు వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. కాల్పుల విర మణ ప్రణాళికపై ఇరాన్ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా చెప్పారు. కాగా అమెరికా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.పాకిస్తాన్‌విదేశాంగకార్యాలయ ప్రతినిధితాహిర్ అంద్రబి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

# తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధి కారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగే అంబేద్కర్ 135వ జయంతి భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**- జోన్ ఇంచార్జ్ పల్లె ప్రశాంత్ గౌడ్**

**హుజురాబాద్, ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్జీ కుమారి మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించింది.అందులో భాగంగా అదిలాబాద్ జోన్ (వన్) పరిధిలో అదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ జహీరాబాద్ పార్లమెంటరీ స్థాయిలో భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని కరీంనగర్లోని మహాత్మ జ్యోతి రావు పూలే (సర్కస్ గ్రౌండ్) మైదానంలో ఈనెల 14న బి.ఎస్.పి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతు న్నామని జోన్ ఇంచార్జ్ పల్లె ప్రశాంత్ గౌడ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంతి వాల్ పోస్టర్లు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అగ్రవర్ణ




పేదలందరూ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు అంబేద్కర్ అభిమానులు అంబేద్కర్ సంఘ నాయకులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, బీఎస్పీ ఎమ్మెల్యే ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, హైదరాబాద్ మండల ఇన్చార్జ్ రామ్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు కండే తిరుపతి, పట్టణ అధ్యక్షులు గరవేణ శ్రీకాంత్ , మామిండ్ల మల్లయ్య, మీడియా సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ మంద జగన్ , బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకమర్రి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు మాడుగుల ఓదెలు, తునికి సమ్మయ్య , తదితరులు పాల్గొన్నారు.

---

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా మల్లంపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ...



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకానీ మహేందర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలతో కలిసి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా బీజేపీ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసి కార్యకర్తలు ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ కత్తి హరీష్ గౌడ్, గొట్టేముక్కల నరేష్ శర్మ, ఎండిగా రాజు, కొండ యుగేందర్, భయ్యా రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

---

# నాణ్యతమైన ఆహారంతోనే మెరుగైన జీవనం సాధ్యం

**ప్రతి ఒక్కరూ తీసుకునే ఆహారంపై శ్రద్ధ వహించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు జిల్లా,ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారానే మెరుగైన జీవనం సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ ఆహారంపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు.సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్ర మంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద "Eat Right Walk"ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఈట్ రైట్ వాక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నుంచి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను చేపడుతుందని ఇందులో భాగంగా ఏప్రిల్ 6వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నుంచి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు "Eat Right Walk"ను అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు.మనం తీసుకునే ఆహారం మన ఆరోగ్యంపై దాదాపు 90 శాతం




ప్రభావం చూపుతుందని, మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతిరోజు ప్రజలు రోజువారి కార్యక్రమాల హడావిడి లో పని భారంతో కూడిన జీవనశైలిలో సతమతమ వుతూ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అందుబా టులో బయట లభించే అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల చిన్న వయస్సులోనే క్యాన్సర్, గుండెపోటు వంటి ప్రమాదకర వ్యాధులు పెరుగుతు న్నాయని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమ వుతున్నాయని పేర్కొన్నారు. పొంచి ఉన్న అనారోగ్య ఉపద్రవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆహారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఆహారమే మహాభాగ్యం అనే అంశాన్ని గుర్తు చేసుకుంటూ జంక్ ఫుడ్ స్వస్తి పలుకుతూ తాజా




కూరగాయలు, వేడి భోజనం, ఇంట్లో వంటకాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు రోజువారీ జీవితంలో పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు.తిను బండారా లు, భోజనశాలలు, అల్పాహార కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, భోజన తయారీ ఉపయోగించే ముడి సరుకుల నాణ్యత ప్రమాణాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి, డి ఎం హెచ్ ఓ గోపాలరావు, డి సి హెచ్ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ వెంకయ్య, సి.హెచ్.సి వైద్యాధికారి సురేష్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# గిరివాణి, ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**• గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమానికి 60 • ప్రజావాణి కార్యక్రమానికి 32 • జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్**



**ములుగు జిల్లా, ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** గిరివాణి, ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి – గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమానికి 60, ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఏ పి ఓ వసంత రావు, ఆర్డీఓ వెంకటేష్, డి డి జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ఐటిడిఏ ఎస్ ఓ, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, ఎం పి ఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# హబ్సిగూడలో డివిజన్లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఉప్పల్, ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):**భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హబ్సిగూడ డివిజన్లో పలు ప్రాంతాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి చింతకింది ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.రవీంద్ర నగర్, జేఎస్ఎన్ కాలనీ, సాయి చిత్ర నగర్ కాలనీల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబిసి మోర్చా పూర్వ అధికార ప్రతినిధి వేములకొండ సోమశేఖర్ మాట్లాడుతూ వ్యక్తి కన్నా పార్టీయే మిన్న అని దేశం కోసం ధర్మం కోసం, నమ్ముకున్న సిద్ధాంతం కోసం, నిరంతరం పార్టీకి విధేయులుగా ఉండాలని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని, చివరి వ్యక్తికి ప్రయోజనం చేకూరే వరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జిల్లెల్ల రవీందర్ రెడ్డి,గాదే శ్రీనివాస్, ఆర్.వి.శేఖర్, బొమ్మగాని రఘుపతి గౌడ్, బండి పద్మ, పుల్లూరు భాస్కర్, కనావత్ రాజు నాయక్, బానోతు రమేష్ నాయక్, కట్ట భాస్కర్, సాదినేని గీత, కోండేరు స్రవంతి, అనంతలక్ష్మి కాలనీవాసులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

---

# ప్రజలు ఆహార భద్రతలో రాజీ పడొద్దు : జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.

**ములుగు జిల్లా,ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలందరూ ఆహార భద్రత నాణ్యత విషయంలో రాజీ పడవద్దని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలలో ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే పై జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా ఆహార భద్రత విషయంలో రాజీ పడకూడదని నాణ్యమైన ఆహారం




ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యపడుతుందని పేర్కొన్నారు.ఆహార ముడి పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా గడువు తేదీ ప్యాకింగ్ తయారీ తేదీ క్షుణ్ణంగా పరిశీలించాలని గడువు తీరిన వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని సూచించారు.పాఠశాలలో, వసతి గృహాలలో విద్యార్థులకు అందించే భోజనం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.హోటల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ స్వీట్ హౌస్ నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వాటిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ వేణుగోపాలరావు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ జోనల్ ఆఫీసర్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి జనార్ధన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# మాజీ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం: మొర్రిరాజుయాదవ్....

**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 06 (పిసిడబ్ల్యూ న్యూస్):** గజ్వేల్లో మాజీ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడి హేయమైన చర్య ఈ చర్యను మల్లంపల్లి మండల BRS యూత్ అధ్యక్షుడు మొర్రిరాజుయాదవ్ తీవ్రంగా ఖండించారు తెలంగాణరాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కెసిఆర్ తెలంగాణనుబంగారు తెలంగాణగాతీర్చిదిద్దడం కోసం అహర్నిశలు కృషి చేసిన మహానేత కెసిఆర్ అంటే ఒక వ్యక్తి కాదు ఒక వ్యవస్థ రైతును రాజుగా చేసిన మహనీయుడు అలాంటి నాయకుడి క్యాంప్ కార్యాలయం పై దాడి చేయడం అమానుషం ఈ చర్యను నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారుఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అనేది ప్రభుత్వ ఆస్తి. అలాంటి కార్యాలయంపై దాడి చేయడం అంటే ప్రభుత్వ ఆస్తులనే ధ్వంసం చేసినట్లేనని ఆయన పేర్కొన్నారు ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఇలాంటి దాడులను ప్రోత్సహించడం చాలా దురదృష్టకరం ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలు




చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరం మరియు ఖండనీయమని అన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలను 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తున్నట్టుగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడి క్యాంపు కార్యాలయంపైనే ఇలాంటి దాడులు జరుగుతున్న పరిస్థితుల్లో సాధారణ ప్రజలకు భద్రత ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు.ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మొర్రిరాజుయాదవ్ గారు కోరారు.

---

# ప్రైవేట్ కాలేజీల కన్నా ప్రభుత్వ కాలేజీలే మిన్న లెక్చరర్ల అవగాహన కార్యక్రమం



**ఏటూరునాగారం, ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేట్ కాలేజీల కన్నా ప్రభుత్వ కాలేజీలే మిన్న అనే నినాదంతో ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు వినూత్న అవగాహన కార్యక్రమం చేపట్టారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థుల సంఖ్య పెంచే లక్ష్యంతో, పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలుస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా లెక్చరర్లు మామిడి శంకర్, మర్రి పాపారావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ కాలేజీల స్థాయిని పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆధునిక పద్ధతులతో బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విశాలమైన గ్రౌండ్, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ప్రభుత్వ కాలేజీలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అందువల్ల ప్రతి విద్యార్థి, విద్యార్థినులు ప్రభుత్వ కాలేజీలలోనే చేరాలని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పార్టీ జెండా ఎగరవేసిన కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ ...




**కరీంనగర్,ఏప్రిల్06(పీసీడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ ఏడో డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ హౌసింగ్ బోర్డ్ లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. తదనంతరం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో తోట సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట సాగర్ మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో ఏర్పాటైన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తల కలిగిన పార్టీగా అవతరించిందన్నారు. గొప్పనైన ఇలాంటి పార్టీ లో తాను కూడా ఒక కార్యకర్త అయినందుకు గర్వంగా ఉందన్నారు. బిజెపి కుటుంబ సభ్యులందరికీ ఆయన ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శన...




**ఇల్లంతకుంట,ఏప్రిల్06(పీసీడబ్ల్యూ న్యూస్):** అపర భద్రాద్రి ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా శాఖ, ఇల్లంతకుంట, జమ్మికుంట మండల శాఖ, గురువు కోడూరు తిరుపతి,తెలంగాణ రంగస్థలం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమ్మిరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన చిరుతల రామాయణ కార్యక్రమం మల్యాల గ్రామ కళాకారులచే గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు. చివరి రోజు ఆహ్లాదకరంగా ఆంజనేయుడు లంకకు బయలుదేరూ సన్నివేశాలతో రావణువధ జరిగే సన్నివేశం వరకు ప్రదర్శన నిర్వహించారు. రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా కోశాధికారి నలగోని రమేష్, శంకరపట్నం మండల అధ్యక్షుడు దొంగల రాజయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు కోడూరు రవీందర్, వివిధ గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా తోట రామారావు జన్మదిన వేడుకలు



**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని TRR హాస్పిటల్‌లో తోట రామారావు గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా హాస్పిటల్ ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది.హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ తోట లక్ష్మణ్ గారు, వైద్య సిబ్బంది మరియు ఉద్యోగులు కలిసి కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. డాక్టర్ తోట లక్ష్మణ్ గారు రామారావు గారిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం హాస్పిటల్ సిబ్బంది అందరూ కలిసి జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్నేహభావం, పరస్పర గౌరవం, ఆనందంతో నిండిన ఈ వేడుకలు అక్కడి వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది మాట్లాడుతూ, తోట రామారావు ఆరోగ్యంగా, సంతోషంగా మరెన్నో సంవత్సరాలు

# గుండ్లపల్లి స్టేజ్ వద్ద బిజెపి జెండా గద్దెను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్...

### • సిద్ధాంతమే బీజేపీ స్ట్రెంత్...

### క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి...

**గన్నేరువరం,ఏప్రిల్06(పీసీడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండలం గుండ్లపల్లి స్టేజ్ వద్ద సోమవారం రోజున బిజెపి జెండా గద్దె ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండాను కేంద్రమంత్రి బండి సంజయ్ ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఎంచుకున్న సిద్ధాంతం, భావాజాలం తో నే ఈ స్థాయికి వచ్చిందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా అవతరించిందని , క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి అన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు దేశాన్ని ఏలుతుందని , వరుసగా 3 సార్లు కేంద్రం లో అధికారం లో వచ్చిందని, దేశంలోనే తిరుగు లేని శక్తిగా అవతరించిందన్నారు. బీజేపీ పార్టీ అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పదన్నారు. పార్టీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాల్



ఉపాధ్యాయ ఆకాంక్షించినట్టు అర్హులైన పేద వారందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలనే సంకల్పంతో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే నేషన్ ఫస్ట్.,పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదం బిజెపి విధానమన్నారు. దేశ ప్రజలాంత బిజెపి పై ఎనలేని విశ్వాసం తో ఉన్నారని, అందుకే వరుసగా మూడుసార్లు కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందన్నారు.,. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకు వెళ్లడానికి కృషి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యలపై నిరంతరం పోరాటం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కరివేద మైహిపాల్ రెడ్డి, పుల్లెల పవన్ కుమార్, సొల్లు అజయ్ వర్మ ,ముత్యాల జగన్ రెడ్డి ,సోమరాజు రెడ్డి ,పకిడి మహేందర్, పుల్లెల రాము, బొమ్మిడి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తదనంతరం బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గన్నేరువరం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ పార్టీ జెండాను ఎగరవేశారు.



# ఆర్జికే అంబేద్కర్ సెంటర్లో జాగ్జీవన్ రామ్ జయంతి మహోత్సవం



### నాకు ఇంత గొప్ప పేరు ఉన్నది అంటే బాబా సాహెబ్ మాత్రమే లేకుంటే ఎదో గుడి వద్ద ?... ముఖ్యఅతిథి గౌడ రవికిరణ్

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్)** :మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్ లోని అర్జీకే అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్,,బాబు జాగ్జీవన్ రామ్ జయంతి మరియు ప్రతి వారం జరిగే మహానుభావులకు ప్రతి ఆదివారం పూల మాల కార్యక్రమం ఈ 10వ వారం జ్ఞానమల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌడ రవికిరణ్ హాజరైడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ లకు పూల మాలు వేసీ స్మరించుకున్నారు అనంతరం అంబెడ్కర్ సంఘం అధ్యక్షులు గోల్లూరి రాజు ఈ నాటి సభ అధ్యక్షతలో ముఖ్య అతి దళిత రత్న రవికిరణ్ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ ( బాబూజీ ) బీహార్ లోని చంద్వలో దళిత కుటుంబంలో జన్మించి,చిన్నతనం లోనే వివక్షను అంటరానితనం, పేదరికాన్ని అనుభవించారు పాఠశాలలో అయనకు నీటి కోసం ఒక కుండఉంచే వారు, కానీ అయన దాన్ని పగులగొట్టి, అందరితో సమానంగా నీళ్లు తాగే ధైర్యం చేశారు. తన తెలివి తేటలతో ఉన్నత విద్యను అభ్యసించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా కాకుండా 1937 లో బీహార్ అసెంబ్లీ కి ఆ తరువాత పార్లమెంట్కు ఎన్నికై ( సుమారు 30 సం,,) కేంద్ర మంత్రిగా పని చేసిన అరుదైన నాయకుడు అణగారిన వర్గాల సామానత్వం కోసం పోరాడాడు 1971 లో పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా వ్యవహరించి, బాంగ్లాదేశ్ ఏర్పాటు లో కీలక పాత్ర పోసించారు అయన సేవలకు గుర్తింపుగా బంగ్లాదేశ్ ప్రభుత్వం "ఫ్రెండ్స్ ఆఫ్ లైబరేషన్ వార్" గౌరవాన్ని అందించింది. భారత ప్రజలు ప్రతి సం,, ఏప్రిల్ 5న అయన జయంతి ని జరుపుకుంటారు.అనంతరం అంబెడ్కర్




సంఘం అధ్యక్షులు డాక్టర్, గోల్లూరి రాజు పూల మాల కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ముక్యంగా గాదె రామకృష్ణ, నాగరాజులకు ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమనికి ముఖ్య సలహాదారులుఈగ శ్వేత, అబ్బులు, పులిపాక తిరుపతి, గుజ్జుక పర్శురాం, పోతరాజు రాములు.సలహాదారులు స్వామి,జగన్ నాద్, ఎస్ సంపత్, జెల్లా నర్సింహా,గౌరవ అధ్యక్షులుమంగళపురి వెంకటేష్ మాజీ కౌన్సలర్. అధ్యక్షులు డాక్టర్,,గోల్లూరి రాజుఆర్గనైజింగ్ సెక్రెటరీనామడి రాజా. సందీప్, జాయింట్ సెక్రటరీ గాదె రామకృష్ణ, ముద్దసాని నరేష్, కన్నయ్య. కోశాధికారి గాలి సురేష్, ఉపాధ్యక్షులుపాడుగుల రూప, జ్యోతి, సాయి రెడ్డి,వర్కింగ్ ప్రసిడెంట్ పేరం ఎల్లయ్య, పాముల రంగయ్య,బొల్లం పాండు, జిమ్ వెంకటేష్ **కమిటీ సభ్యులు** ఖాదీర్,దాస్, అజయ్, నాగరాజు, శ్రీనివాస్, డి నాగేశ్వరావు. అంబెడ్కర్ సంఘం దమ్మాయిగూడ అధ్యక్షులు బోడ నరేష్,బయ్యే గౌతమ్,పాడుగుల చంద్రమౌళి (స్వేరో )సానది సాయిబాబా, నము నాయక్, దేవేందర్, ఎం కుమార్, సిరాజ్ ఖాన్, కే శ్యామ్ సుందర్, పి రాజు,చిన్న, వెంకట్, బి మల్లేశం, పి స్వాతి, బి రాంబాబు, కే రామ్ గోపాల్, బి చెంద్రశేఖర్, ఆర్ జి కె డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,అంబేద్కర్ సంఘం సభ్యులు,డబుల్ బెడ్ రూమ్, ఆర్ జి కె కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు పేదలకు అందించడమే సర్కార్ లక్ష్యం...





### - మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**మానకొండూర్,ఏప్రిల్6(పీసీడబ్ల్యూ న్యూస్):** సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మానకొండూకర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఆయన 181 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేదలను అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ఆ పథకాల ఫలాలు ప్రజలకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించి వైద్యం



పొందిన వారికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద అందించే సాయం వారికి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మానకొండూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 24 విడుతల్లో సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయాలు అందించిందని, 24వ విడుతలో మానకొండూర్ మండలంలో 181 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద 46,76,500 రూపాయలు మంజూరు కాగా, వాటిని చెక్కుల రూపంలో అందిస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, మడుపు ప్రేమ్ కుమార్,తాళ్లపల్లి నరేష్, కోండ్ర సురేష్, ఇర్ఫాన్, సత్తిరెడ్డి, తిరుమల్ రెడ్డి, సాయిరి దేవయ్య, ఆర్ తిరుపతి, బోళ్ల మురళీ, మాడ తిరుపతిరెడ్డి, గొల్లెన కొమురయ్య, కనకం కుమార్, బాకారపు రమేశ్, దూలం దేవేంద్ర, వాల సుజిత్ రావు, ముక్కెర సతీష్ రావు, రామకృష్ణ, నాగిశెట్టి రాజయ్య, రాములు, బుర్ర శ్రీధర్ గౌడ్, కిషన్, ఎడ్ల శ్రీధర్, ఎన్.బాపురావు, గుజ్జ ప్రభాకర్, వేగోళపు శ్రీనివాస్ గౌడ్, కొమురయ్య, టేకుమల్ల అంజయ్య, మాతంగి సహదేవ్, కనవేణి శ్రీనివాస్, రేండ్ల రాజలింగం తదితరులు పాల్గొన్నారు. **లలితాపూర్ లో...** మానకొండూర్ మండలం లలితాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. గ్రామానికి చెందిన దాడి మమత-లక్ష్మణ్, వేల్పుల అయిలమ్మ, కాల్వ రమ్య-సతీష్ లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వారు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని సోమవారం గృహప్రవేశాలు జరుపుకోగా, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. మానకొండూర్ ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహశీల్దార్ విజయ్ కుమార్, మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, సర్పంచ్ పి.శారద,ఉప సర్పంచ్ మర్రి కుమారస్వామి, కేడీసీసీ డైరెక్టర్ మర్రి కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వీ.సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బంజేరుపల్లిలో భూమిపూజ, వన్నారంలో వీవో భవన నిర్మాణ పనులకు శిలాఫలకం వేశారు.

# భూదాన్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతులకు ఇచ్చిన భూమిలో ఇండ్ల నిర్మాణాలు చేయటం సరైంది కాదు ● పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు భూమి అప్పగించాలి ● విలేకర్ల సమావేశంలో బోధన్ రైతుల ఆవేదన




**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం వెలుగుమట్ల భూధాన్ భూమిలో భూదాన్ బోర్డు వారు 31.7 ఎకరాల భూమిని 27 మంది నిరుపేద రైతు కూలీలకు భూములు అప్పగించటం జరిగిందని, 1953 నుంచి 1960 మధ్యకాలంలో ఈ భూములను సాగు కోసం నిరుపేద రైతులకు ఆనాడు అప్పగించటం జరిగిందని బోధన్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలుగుమట్ల భూధన్ రైతులు వారి కుటుంబ సభ్యులు బందెల వెంకన్న, బందెల కృష్ణ, రెంటపల్లి మోతరయ్య, ఎస్ కే జానీ మియా లు మాట్లాడుతూ... బోధన్ బోర్డు వారు 1953 నుంచి 1960 సంవత్సర మధ్య కాలంలో పుట్టకోట, గొల్లగూడెం, గోపాలపురం తదితర గ్రామాలకు చెందిన 27 మంది నిరుపేదలకు సర్వే నెంబర్ 147, 148, 149 సర్వే నెంబర్లలో 31.7 ఎకరాల భూమిని దానంగా సాగు కోసం ఇచ్చారని తెలిపారు. శీలం మంగయ్యకు రెండు ఎకరాలు, షేక్ సైదులు కు ఎకరం 20 కుంటలు, హాబీ కి రెండు ఎకరాలు, రెడ్డి బోయిన రంగయ్యకు రెండు ఎకరాలు, బందెల లక్ష్మయ్యకు ఎకరం, షేక్ అక్బర్ సాబ్ కు రెండు ఎకరాలు, మద్దెల లచ్చయ్యకు ఎకరం, యలీజాల పున్నయ్యకు ఎకరం, మహమ్మద్ ఖాసిం కు ఎకరం 20 గుంటలు , దోమల అచ్చయ్యకు రెండు ఎకరాలు రెంటుపల్లి సుబ్బయ్యకు రెండెకరాలు, పల్నాటి చంద్రయ్యకు రెండు ఎకరాలు ఇలా 27 మందికి భూధాన్ బోర్డు వారు పంట సాగు చేసుకునేందుకు వ్యవసాయ రైతు కూలీలకు భూములు అప్పగించటం జరిగిందని వెల్లడించారు. గత ఏడు సంవత్సరాల క్రితం కొందరు వ్యక్తులు తమపై దౌర్జన్యానికి దిగి మా భూములలో గుడిసెలు వేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకున్న తమను తమ కుటుంబ సభ్యులను కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి దిగి కొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ఆ గుడిసెలను తొలగించి గుడిసెలు కోల్పోయిన వారికి అదే స్థలంలో ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి హక్కు కలిగిన రైతులకు కనీసం సమాచారం ఇవ్వకుండా మా భూములను ఎలా ఇతరులకు కేటాయిస్తారని ప్రశ్నించారు. పహానీ, పట్టాదారు పాసుపుస్తకాలు హక్కు కలిగి ఉన్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని వారు జోక్యం చేసుకొని భూములు కోల్పోయిన నిరుపేద రైతులమైన తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో దోమల నాగరాజు, పర్నాటి బుచ్చి రాములు, లకావత్ నాగేశ్వరరావు, దోమల రాము, గండికోట మనీ, కుర్ర రామ సైదులు, ఎస్కే జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...





**కరీంనగర్,ఏప్రిల్06(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ సెంట్రల్ జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ లోని టవర్ సర్కిల్ లో 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు.కరీంనగర్ సెంట్రల్ జోన్ లోని బిజెపి రాష్ట్ర, జిల్లా జోన్ నాయకులు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు, బిజెపి కుటుంబ సభ్యులందరికీ భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. 1980 ఏప్రిల్ 06 తేదీన అటల్ బీహార్ వాజ్ పాయ్ నేతృత్వంలో ఏర్పడిన బిజెపి దేశభక్తి, జాతీయవాదము, ఏకాత్మత మానవతావాదము, అంత్యోదయ మార్గంలో ప్రయాణిస్తుందన్నారు. దేశభక్తి, జాతీయభావము కలిగిన కార్యకర్తలు బిజెపిలోనే ఉంటారని తెలిపారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు రాజకీయ విలువలతో పాటు, సామాజిక స్పృహ సేవా తత్పరత కలిగి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ ,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, కే పీ చంద్ర, గొట్టేముక్కుల ఉమారాణి ,తాటి ప్రభావతి, జిల్లా కోశాధికారి వైద రామానుజం నాయకులు లడ్డు ముందడ, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యునిగా బోడ రమేష్ నియామకం రాష్ట్ర అధ్యక్షునికి కృతజ్ఞతలు



**సీరోల్, ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వస్తున్న మారుమూల గ్రామంలో ఉన్నటువంటి సీరోల్ మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన యువ నాయకుడు బోడ రమేష్‌ను జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నియామకం జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న బోడ రమేష్ సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి ఈ నియామకానికి ప్రధాన కారణమని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా బోడ రమేష్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా కార్యవర్గ సభ్యునిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత కట్టుబాటుతో పనిచేస్తానని ఆయన తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేసి, కార్యకర్తలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. బోడ రమేష్ నియామకంతో మహబూబాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహం, దిశ లభిస్తుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కార్యాలయంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి

**ప్రభుత్వ కార్యక్రమాల్లో నిష్పాక్షికత దెబ్బతింటోందని 18 వ వార్డ్ కౌన్సిలర్ పెడకంటి కృష్ణయ్య ఆవేదన**


**కల్లూరు, ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల జరిగిన పార్టీ ప్రెస్ మీట్‌తో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో చోటుచేసుకున్న ప్రోటోకాల్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ 18వ వార్డ్ కౌన్సిలర్ పెడకంటి కృష్ణయ్య (ఆర్.కె) డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించిన ఆయన, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సేవలకు కేటాయించిన మున్సిపల్ కార్యాలయాన్ని రాజకీయ కార్యకలాపాలకు వేదికగా ఉపయోగించడం అనుచితమని కృష్ణయ్య పేర్కొన్నారు. మార్చి 31, 2026న సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల సేవ కోసం ఉండాల్సినప్పుడు, రాజకీయ వేదికలుగా మారడం సరైన పద్ధతి కాదన్నారు.అదేవిధంగా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ప్రోటోకాల్ పాటించకపోవడం బాధాకరమని ఆయన తెలిపారు. మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యే ఫోటోలు మాత్రమే ఉంచి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చిత్రాలు లేకపోవడం సరైంది కాదన్నారు. ఇది ప్రజల్లో తప్పుదోవ పట్టించే సందేశాన్ని పంపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించే కార్యక్రమాలు నిష్పాక్షికంగా ఉండాలని, అందరి ప్రజాప్రతినిధులకు సమాన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని కృష్ణయ్య స్పష్టం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనల వల్ల ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.ఈ నేపథ్యంలో సంబంధిత అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను ఆయన విజ్ఞప్తి చేశారు.



## మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు మండలంలోని వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం సోమవారం ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి .పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో ప్యాక్స్ (పిఎసిఎస్) వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ రైతులు పండించిన మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా తమ పంటను విక్రయించుకోవడం వల్ల నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయని పేర్కొన్నారు.మొక్కజొన్న రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సమయానికి చెల్లింపులు జరిగేలా అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు తమ పంటను శుభ్రంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్యాక్స్ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు..





# అదిరే.. అదిరే..

● వేడుకగా అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం






**హైదరాబాద్, ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** బర్కత్ పుర లోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 'తరంగ్ 2క26' పేరుతో నిర్వహించిన వేడుకల్లో ఆట పాటలతో విద్యార్థులు తమదైన శైలిలో స్టెప్పులు వేసి ఆకట్టుకున్నారు. వెస్ట్రన్, క్లాసిక్ డాన్స్ ల తో అదరగొట్టారు. విద్యార్థులు తమ విద్యా నైపుణ్యాలతో పాటు కళాత్మక, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేడుక ఒక చక్కని వేదికగా నిలిచింది. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, దానికి భయపడాలిసన అవసరం లేదని ధైర్యం చెప్పారు. విద్యార్థులు సమాజంలో సమస్యలకు పరిష్కారాలు చూపేలా వినూత్న ఆలోచనలు చేయాలని, తల్లిదండులను, గురువులను ఎల్లప్పుడు గౌరవించాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, వై.రాజశేఖర్, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీనివాస్ రావు, ఎం.జ్ఞానేశ్వరి, డాక్టర్ ఎం.ప్రియాంక, ఐ. శ్రావణకుమార్, ఎంవిఎస్ఎస్ సందీప్, డాక్టర్ జయప్రద, డాక్టర్ ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా నూతన కూరగాయల మార్కెట్ ప్రారంభిస్తాం




**- గ్రామస్తుల కోరిక మేరకే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి.**

**- గ్రామ సభలో వెల్లడించిన మాజీ సర్పంచ్ విసం పల్లి బాలకృష్ణ.**

**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 6(పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామస్తులు చాలామంది కూరగాయలు కొనుగోలు చేయాలన్న దగ్గర ప్రాంతంలో కూడా ఎక్కడా లభించకపోవడంతో ప్రతి మంగళవారం పని కట్టుకొని కూరగాయలు కొనుక్కునేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. ఈ ప్రాంతంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలలో పండించిన కూరగాయలను ఒకే చోట మండల కేంద్రంలో కాకుండా గ్రామాల వారిగా కూరగాయల మార్కెట్లను ప్రారంభిస్తే ఆ గ్రామాల వారికి సుదూర ప్రాంతాలకు వెళ్లే వీలు లేకుండా గ్రామంలోని కూరగాయలు లభిస్తాయని పలువురు గ్రామస్తులు గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో కొందరు రైతులు గ్రామ సర్పంచి దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. గతంలో కూడా ఈ గ్రామంలో కూరగాయల సంత ఉండేదని కొందరు గుర్తు చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామంలో గ్రామపంచాయతీ ప్రాంతంలో గల ఖాళీ స్థలంలో గ్రామస్తుల కోరిక మేరకు ప్రతి శుక్రవారం కూరగాయల మార్కెట్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని సభాముఖంగా మాజీ సర్పంచ్ బాలకృష్ణ వెల్లడించారు. గ్రామం మధ్య ప్రాంతంలో ఉండటంలో అందరికీ అందుబాటు ఉంటుందని గ్రామస్తుల కోరిక మేరకే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కొందరు కూరగాయలు అమ్ముకునేవారు పాత వాటర్ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారని అలా కాకుండా గ్రామపంచాయతీ ప్రాంతంలో ఎవరైనా కూరగాయలు అమ్ముకోవచ్చని ప్రతి శుక్రవారం ఏర్పాటు గ్రామంలో వారికి ఎంతో మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు.



# విద్యా రంగానికి నూతన దిశ చూపుతున్న శిక్షకుడు డా.యాసీన్ అన్వర్ బాషా

**డా. యాసీన్ అన్వర్ బాషా అంటే ఒక వ్యక్తి కాదుడ ఒక స్ఫూర్తి..**

**ఒక విజన్ ఉన్న విద్యావేత్త**

**ఒక ఆలోచనల ఆర్కిటెక్ట్**

**ఒక మీడియా మాస్టర్‌మైండ్...**

**ఒక నిరంతర మార్పు ప్రయాణం..**





**హైదరాబాద్ ఏప్రిల్06(పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజాన్ని అర్థం చేసుకుని కమ్యూనికేషన్ ద్వారా మార్పు తీసుకువచ్చే చైతన్య శక్తి ఆయనది. నవతరానికి ఒక గురువు మాత్రమే కాదు, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే శిల్పి కూడా. పరిశోధకుడిగా లోతైన ఆలోచనలు, శిక్షకుడిగా ప్రేరణాత్మక బోధన, నాయకుడిగా మార్పు దిశగా అడుగులు, ఈ మూడు లక్షణాలు ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి. విద్య, మీడియా, సామాజిక అభివృద్ధి రంగాలు, ఒక్కొక్కటి వేర్వేరు ప్రపంచాల్లా కనిపించినాడ వాటిని ఒకే దారిలో నడిపిస్తూ సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచిన వ్యక్తి డా. యాసీన్ అన్వర్ బాషా.. దాదాపు రెండున్నర దశాబ్దాలకుపైగా ఉన్న అనుభవంతో ఆయన సాధించిన ప్రతిష్ఠ, ప్రభావం, సేవలు... ఇవన్నీ కలిసి ఆయనను ఒక సాధారణ వ్యక్తి నుంచి అసాధారణ వ్యక్తిగా నిలబెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కంభం ప్రాంతంలో పుట్టి, అక్కడి నుంచే తన ప్రయాణాన్ని ప్రారంభించిన యాసీన్ అన్వర్ బాషా, తన కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మేధావిగా ఎదిగారు. విద్యపై ఆయనకు ఉన్న అభిరుచి, సమాజంపై ఉన్న బాధ్యతా భావం ఆయనను ఎప్పటికప్పుడు కొత్త మార్గాలు వెతుక్కునేలా చేసింది. **విద్యలో మార్పు కోసం పోరాడిన మార్గదర్శి** ప్రాథమిక విద్యార్థుల అభ్యాస నాణ్యతను మెరుగుపర్చడం అనేది ఒక పెద్ద సవాలు. కానీ ఈ సవాలును అవకాశంగా మార్చుకున్నాడు డా. యాసీన్ అన్వర్ బాషా. పాఠ్యపద్ధతుల ఆధారంగా రూపొందించిన విద్యా చిత్రాలు, ఉపాధ్యాయుల సామర్థ్య వికాసంపై ఆయన చేసిన కృషి విద్యారంగంలో ఒక కొత్త దిశను చూపించాయి.

విద్యను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, విజువల్ లెర్నింగ్ ద్వారా పిల్లల్లో ఆసక్తి పెంచే ప్రయత్నం ఆయన ప్రత్యేకత. **మీడియా రంగంలో ముద్ర వేసిన నిపుణుడు** వార్త, ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి ప్రముఖ మీడియా సంస్థల్లో జర్నలిస్టుగా, సీనియర్ ప్రొడ్యూసర్‌గా పనిచేసిన అనుభవం, ఆయనకు మీడియా లోతులను అర్థం చేసుకునే శక్తిని ఇచ్చింది. విజువల్ స్టోరీటెల్లింగ్‌లో ఆయన నైపుణ్యం, వార్తను ప్రజల మనసుల్లో నిలిచేలా చెప్పగల సామర్థ్యం, ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. **సామాజిక మార్పు కోసం కమ్యూనికేషన్ ఆయుధం** సోషల్ అండ్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ (ఎస్బీసీసీ ) రంగంలో ఆయన చేసిన కృషి విశేషం. యూనిసెఫ్ విద్యా ప్రాజెక్టుల్లో రాష్ట్ర స్థాయి ప్రోగ్రామ్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉపాధ్యాయ శిక్షణ, పాఠ్య విధానాల రూపకల్పన, విద్యా డాక్యుమెంటరీల నిర్మాణంలో ఆయన చూపిన ప్రతిభ సమాజంలో స్థిరమైన మార్పుకు దోహదపడింది. **అకడమిక్ రంగంలో ఆదర్శప్రాయ గురువు** జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్‌లో పీహెచ్‌డీ థీసిస్ సమర్పించడం ద్వారా అకడమిక్ రంగంలో తన ప్రావీణ్యాన్ని చాటుకున్న ఆయన, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో సోషల్ వర్క్‌లో డిగ్రీ సాధించడం ద్వారా తన విద్యా పునాది మరింత బలపరచుకున్నారు. అయితే ఆయన ప్రతిభ అక్కడితో ఆగలేదు. లోయోలా అకాడమీ, కె.ఎల్. యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో అధ్యాపకుడిగా సేవలందిస్తూ, కేవలం బోధనకే పరిమితం కాకుండా సిలబస్ రూపకల్పనలో, ఆధునిక విద్యా విధానాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

విద్యార్థులలో ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఆయన రూపొందించిన బోధనా విధానాలు, అకడమిక్ వ్యవస్థలో నూతన మార్పులకు నాంది పలికాయి. ఈ విధంగా డా.యాసీన్ అన్వర్ బాషా విద్యను ఒక సాధనంగా కాకుండా, సమాజ నిర్మాణానికి ఉపయోగపడే శక్తిగా మలిచిన అరుదైన విద్యావేత్తగా నిలిచారు. **బహుముఖ ప్రతిభ ఒకే వ్యక్తిలో ఎన్నో శక్తులు** జర్నలిజం, కమ్యూనికేషన్, సోషల్ వర్క్ రంగాలను సమన్వయం చేసిన ఆయన విద్యార్హతలు, పరిశోధనలపై ఆసక్తి, శిక్షణలో నైపుణ్యం, ఇవన్నీ కలిసి ఆయనను ఒక బహుముఖ ప్రతిభాశాలిగా నిలబెట్టాయి. పీహెచ్‌డీ స్థాయి పరిశోధనతో ఆయన అకడమిక్ ప్రపంచంలో తన స్థాయిని మరింత పెంచుకున్నారు. **స్ఫూర్తిదాయక ప్రయాణం భవిష్యత్తుకు దారి** డా. యాసీన్ అన్వర్ బాషా ప్రయాణం ఒక వ్యక్తి కృషి ఎంత దూరం తీసుకెళ్తుందో చూపించే ఉదాహరణ. విద్య, మీడియా, సమాజం...ఈ మూడు రంగాల్లో సమానంగా ముద్ర వేసిన ఆయన, నిజంగా ఒక మార్పు నాయకుడు. "విద్య ద్వారా మార్పు, మీడియా ద్వారా ప్రభావం, కమ్యూనికేషన్ ద్వారా సమాజ నిర్మాణం" ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టిన వ్యక్తి డా. యాసీన్ అన్వర్ బాషా. ఇలాంటి మహనీయులు సమాజానికి దిక్సూచిలు. ఆయన చూపిన మార్గం అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది... ఇంకా నిలుస్తూనే ఉంటుంది.

# ఖమ్మం ప్రెస్‌క్లబ్‌పై విచారణ చేపట్టాలి




**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్**

**టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో గ్రీవెన్స్ లో**

**వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన**

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**తగు చర్యల నిమిత్తం జిల్లా సహకార అధికారికి ఆదేశాలు**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా కొనసాగేందుకు ఆడిటింగ్ తో పాటు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ - హెచ్ 2843) విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సానుకూలంగా స్పందించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై విచారణ నిర్వహించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ కు సోమవారం గ్రీవెన్స్ లో వినతిపత్రం సమర్పించారు. గత పది సంవత్సరాలుగా జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలపై జర్నలిస్టుల సమక్షంలో ఆడిటింగ్ చేపట్టాలని, ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికలు నిర్వహించాలని కోరటంతో తగు చర్యల నిమిత్తం జిల్లా సహకార అధికారికి రిఫర్ చేశారు. దీనికి ముందు ర్యాలీగా కలెక్టరేట్ కు చేరుకున్న పెడరేషన్ నాయకులు, ముఖద్వారం వద్ద 300 మంది జర్నలిస్టులకు సంబంధించిన ఖమ్మం ప్రెస్ క్లబ్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని నిరసనతో కూడిన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో కొన్ని యూనియన్లు ప్రెస్ క్లబ్ కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా ఉండకుండా, జవాబుదారీతనం లేకుండా ఇష్టానుసారంగా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. సంవత్సరాలుగా ప్రెస్ క్లబ్ లో వస్తున్న ఆర్థిక వనరులను సొంతంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రెస్ మీట్ ఏర్పాటు చేసిన వారి వివరాలు, ఆదాయం, ఖర్చులు, వాటికి సంబంధించిన రశీదులు, బిల్లులు, తీర్మాణాలు చూపకుండా మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రెస్ క్లబ్ వార్షిక బడ్జెట్ పేరుతో విడుదల చేస్తున్న గణాంకాలలో పారదర్శకత లోపిస్తోందని అన్నారు. తప్పుడు లెక్కలతో ప్రెస్ క్లబ్ ప్రతిష్టను దిగదార్చుతున్నారని చెప్పారు. క్లబ్ కు సంబంధించిన నియమ నిబంధనలు ఏవీ ఖమ్మం ప్రెస్ క్లబ్ విషయంలో అమలు కావడం లేదని అన్నారు. 300 మందికి పైగా జర్నలిస్టులకు చెందిన ఖమ్మం ప్రెస్ క్లబ్ వ్యవహారాలపై చాలా కాలంగా కొందరు అనధికారిక పెత్తనం చేస్తూ... అవకతవకలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకునేంత వరకు టీడబ్ల్యూజేఎఫ్ పోరాటం చేస్తూనే ఉంటుందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ పారదర్శకంగా, శాస్త్రీయంగా కొనసాగేందుకు ఎన్నికల నిర్వహించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, జిల్లా నాయకులు కూరాకుల గోపీ, నలుబోల మధుశ్రీ, షేక్ జానీపాష, దగ్గుబాటి మాధవరావు, గణేష్, ఫయాజ్, అర్షద్, కొరకొప్పుల రాంబాబు, గోపీ, కె. కిరణ్, యాకూబ్ పాష, పాష, యూసుప్, నాగలక్ష్మీ, ఉపేందర్, ప్రసాద్, షకీల్, సతీష్, పవన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నివారణకై అవగాహన కలిగి ఉండాలి: బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ

**మేడిపల్లి ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని డిప్యూటీ కమిషనర్ శైలజ అన్నారు. సోమవారం మేడిపల్లిలో నిర్వహించిన అవాగాల కార్యక్రమానికి నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ హాజరై మాట్లాడుతూ...అమ్మాయిలు 18 సంవత్సరాలు వచ్చాక మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో జన్యు పరమైన సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు. బాలికలకు యుక్త వయస్సు వచ్చిన వెంటనే వివాహాలు చేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకుంటున్నట్లు తెలిపారు. స్పందన సేవ సొసైటీ సీఈవో శోభ రెడ్డి మాట్లాడుతూ...మానవుడు అంతరిక్షంలో నివసించే దిశగా అడుగులు పడుతున్న ఈ సాంకేతిక కాలంలో కూడా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయలేకపోవడం చాలా బాధాకరం అని ప్రతి ఒక్కరు బాల్యవివాహాల చట్టంపై అవగాహన కలిగి ఉండి బాల్యవివాహాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వెంకటేష్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు




# బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్ నెట్స్ పంపిణీ



**ముల్లకట్ట రాంపురం,ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు వాలీబాల్ నెట్స్ పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని క్రీడాకారులకు బీజేపీ బూత్ అధ్యక్షులు సొలం చిట్టిబాబు ఆధ్వర్యంలో వాలీబాల్ నెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా జాడి రామరాజు మాట్లాడుతూ, క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని పెంచి ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు. అలాగే బీజేపీ 46 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని 47వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దేశ ప్రజలకు, మేధావులకు, ఉద్యోగులు మరియు నిరుద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ఎర్రల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షులు దుర్గం దుర్గారావు, సొలం పాపారావు, ప్రకాష్, క్రీడాకారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్రామ పంచాయతీల కార్యదర్శి బదిలీలు

**- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీలు అయినట్లు వెల్లడి**



**తొర్రూర్ ప్రతినిధి,ఏప్రిల్ 06(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల కార్యదర్శి లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీలు అయినట్లు తెలిపారు. అందులో భాగంగా తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామానికి చెందిన కార్యదర్శి అంజద్ అలీ గుర్తుర్ గ్రామపంచాయతీ నుండి దంతాలపల్లికి బదిలీ అయినట్టు తెలిపారు. వారి స్థానంలో మహబూబాబాద్ నుండి కార్యదర్శిగా జబాని గుర్తుర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు నేడు చేపట్టనున్నట్లు ఉన్నారని తెలిపారు

# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ

- **నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ**
- **సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక**



**హైదరాబాద్, ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# అంత్యోదయమే లక్ష్యం... ప్రతి ఇంటికి అభివృద్ధి వెలుగు

- **ఖమ్మం 24వ డివిజన్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 6 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని 24వ డివిజన్ శక్తి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. శక్తి కేంద్రం ఇంచార్జ్ రుద్ర ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమం పార్టీ కార్యకర్తలలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్ హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. వారి ప్రసంగంలో బీజేపీ యొక్క ప్రాథమిక సిద్ధాంతమైన "అంత్యోదయ"ను ప్రస్తావిస్తూ, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరడం పార్టీ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలనఇవి బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన స్తంభాలని వివరించారు. "నేషన్ ఫస్ట్" అనే మహత్తర భావంతో ముందుకు సాగుతున్న బీజేపీ, 1980లో చిన్న స్థాయిలో ప్రారంభమై కేవలం రెండు ఎంపీ స్థానాల నుంచి నేటి వరకు దాదాపు 300 స్థానాలకు ఎదగడం ప్రజల విశ్వాసానికి నిదర్శనం అని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారం సాధించడం, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం పార్టీ ప్రగతికి సంకేతమని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదు, ప్రతి కార్యకర్తకు సేవా స్ఫూర్తిని గుర్తుచేసే ఒక బాధ్యతగా మారింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోయినపల్లి చంద్రశేఖర్, మార్తి వీరభద్ర ప్రసాద్, పిల్లలమర్రి వెంకట్, ఊరుకొండ ఖాదర్, వాళ్లలా రమేష్, మనికంఠ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రపంచ రికార్డును కోల్పోయిన టిమ్ డేవిడ్..!



ఆర్సీబీ విధ్వంసకర ప్లేయర్ టిమ్ డేవిడ్ సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. కేవలం 25 బంతుల్లోనే 70 రన్స్ చేసి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. టిమ్ విధ్వంసంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో సీఎస్‌కే 19.4 ఓవర్లలో 207 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆర్సీబీ 43 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే టిమ్ డేవిడ్ ఒక్క పరుగు తేడాతో ప్రపంచ రికార్డును కోల్పోయాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో 15వ ఓవర్ తరువాత బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడి రికార్డు డానియల్స్ సామ్స్ పేరిట ఉంది. అతడు 2022లో ససెక్స్‌పై 71 పరుగులు చేశాడు. తాజాగా టిమ్ డేవిడ్ 70 పరుగులు చేశాడు. అద్భుత ప్రదర్శన చేసినందుకు గానూ టిమ్ డేవిడ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అవార్డును తీసుకున్న తరువాత అతడు మాట్లాడుతూ.. రజత్ పాటిదార్‌పై ప్రశంసల వర్షం కురించాడు. నిజం చెప్పాలంటే ప్రస్తుతం నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. ఇలా ప్రతి రోజు జరగదు. ఇక కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడుతున్నాడు. అతడు ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నాడని డేవిడ్ అన్నాడు. ఇక తాను వివిధ స్థానాల్లో బ్యాటింగ్ చేయడం గురించి మాట్లాడుతూ.. తాను అదృష్టవంతుడినని చెప్పుకొచ్చాడు. తన ఆటను ఎక్కువగా మార్చకుండా ఆడేస్తున్నానని అన్నాడు. ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసేందుకు అవకాశం ఉంది. సహచరులు, మేనేజ్‌మెంట్ నుంచి అద్భుతమైన మద్దతు ఉందన్నాడు.

# ధోనీ ఇక ఐపీఎల్‌లో ఎంట్రీకి సిద్ధం

2026 ఐపీఎల్‌లో వరుస ఓటములతో తీవ్ర నిరాశ ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు కాస్త ఊరటనిచ్చే వార్త బయటకు వచ్చింది. మోకాలి గాయంతో ఐపీఎల్ ప్రారంభానికి ముందే రెండు వారాలు ఆటకు దూరమైన స్టార్ బ్యాటర్ మహేంద్రసింగ్ ధోనీ కమ్‌బ్యాక్ గురించి కీలక అప్డేట్ వచ్చింది. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ ఇప్పటికే నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇక ఫిట్‌నెస్ టెస్టు ఇచ్చేందుకు ధోనీ సిద్ధమైనట్లు చెన్నై క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ ఇక ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు ధోనీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ధోనీకి ఫిట్‌నెస్ జరగనునుంది. అది కూడా ఒకట్రెండు రోజుల్లో ఈ టెస్టు పూర్తయ్యే ఛాన్స్ ఉంది. అతడు వీలైనంత త్వరగా ఫిట్‌నెస్ క్లియర్ చేసుకొని మైదానంలో అడుగుపెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ తదుపరి మ్యాచ్ దిల్లీ క్యాపిటల్స్‌తో ఆడనుంది. ఏప్రిల్ 11 (శనివారం) ఎంఎ చిదంబరం స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ ఉండనుంది. దీంతో ఈ మ్యాచ్‌లోనే ధోనీని తీసుకొచ్చేలా చెన్నై మేనేజ్‌మెంట్ ఏర్పాట్లు చేస్తుంది. అయితే ధోనీ ఇప్పటికే నెట్స్‌లో ప్రాక్టీస్ మొదలు పెట్టేశాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో ధోనీ కంఫర్ట్‌గా కనిపించాడు. దీంతో అతడు ఆర్సీబీతో మ్యాచ్‌లోనే ఎంట్రీ ఇస్తాడని ఫ్యాన్స్ భావించారు. కానీ, ధోనీ విషయంలో సీఎస్కే జట్టు యాజమాన్యం ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదని, అతడిని మైదానంలో దింపే విషయంలో అసలు తొందరపడకూడదని మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందుకే తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ధోనీ రెండు వారాలు దూరం కానున్నాడని ఈ సీజన్ ప్రారంభానికి ముందే సీఎస్కే ప్రకటించడంతో ఫ్యాన్స్ ఆందోళన చెందారు. కానీ, అదే సమయంలో సంజు శాంసన్ జట్టులోకి రావడం, కుర్రాళ్లతో నిండిన ఫ్రాంచైజీ కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. కానీ అంచనాలను తలకిందులు చేస్తూ సీఎస్కే గత మూడు మ్యాచ్‌ల్లో చూపించిన ప్రదర్శన అభిమానులకు నిరాశ కలిగిస్తుంది. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్‌తో ఓడగా, ఇటీవల పంజాబ్ కింగ్స్, తాజాగా ఆర్సీబీ జట్లపై పరాజయం చవిచూసింది. మరి ఇప్పటికైనా చెన్నై ఓటముల బాట వీడి గెలుపు ట్రాక్ ఎక్కాలని అభిమానులు కోరుకుంటున్నారు. ధోనీతోపాటు జట్టు యంగ్ ఆటగాడు డివాల్డ్ బ్రెవిస్ కూడా సీజన్‌కు దూరమయ్యాడు. పక్కటెముకల గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే ఇప్పుడు బ్రెవిస్ కోలుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే దిల్లీతో మ్యాచ్‌లో అతడిని బరిలో దించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు కోచ్ ఫ్లెమింగ్ వెల్లడించారు. ఇక ధోనీ, బ్రెవిస్ రాకతో జట్టులో కొత్త జోష్ రావడం పక్కా!



# ప్రశాంత్ వీర్‌ను వినియోగించుకోని చెన్నై



ఐపీఎల్ 2026 సీజన్లో 5 సార్లు ఛాంపియన్ అయిన సీఎస్కే పరిస్థితి దారుణంగా తయారైంది. ఆడిన మొదటి మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలై పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఎంఎస్ ధోనీ లేని స్పష్టంగా కనిపిస్తుండగా.. కొత్త కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వ లోపాలు, నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రూ.14.2 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్‌ను జట్టు సరిగ్గా ఉపయోగించుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రవీంద్ర జడేజా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు వెళ్లడంతో అతని స్థానాన్ని భర్తీ చేస్తాడని భావించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ ప్రశాంత్ వీర్‌ను భారీ ధరకు సీఎస్కే దక్కించుకుంది. అయితే గత రెండు మ్యాచ్‌ల్లోనూ ప్రశాంత్ వీర్‌కు బౌలింగ్ ఇచ్చేందుకు రుతురాజ్ గైక్వాడ్ సుముఖత చూపలేదు. పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 210 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ఛేదిస్తున్నా ప్రశాంత్ చేత ఒక్క ఓవర్ కూడా వేయించలేదు. ఆదివారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో బౌలర్లు దారుణంగా పరుగులు సమర్పించుకుంటున్నా రుతురాజ్ గైక్వాడ్ ప్రశాంత్ వీర్‌ను బౌలింగ్ వైపు చూడనివ్వలేదు. ఈ పరిస్థితి కేకేఆర్ స్టార్ ప్లేయర్ కామెరూన్ గ్రీన్ ఉదంతాన్ని గుర్తుకు తెస్తోంది. రూ.25.20 కోట్లు పెట్టి కామెరూన్ గ్రీన్‌ను కొనుగోలు చేసినా కేకేఆర్ అతడిని బౌలర్‌గా వాడుకోవడం లేదు. అయితే కామెరూన్ గ్రీన్ విషయంలో గాయం కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి క్లియరెన్స్ లేదని స్పష్టత ఉంది. కానీ ప్రశాంత్ వీర్ విషయంలో ఎలాంటి గాయం సమస్యలు లేవు. అయినప్పటికీ ఓ స్పెషలిస్ట్ స్పిన్ ఆల్‌రౌండర్‌ను కేవలం బ్యాటర్‌గా మాత్రమే ఆడించడం సీఎస్కే వ్యూహాత్మక తప్పిదమని విశ్లేషకులు భావిస్తున్నారు. వరుసగా మూడు ఓటములు ఎదురైన నేపథ్యంలో సీఎస్కే యాజమాన్యం తమ వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

# మానసికంగా కుంగిపోయా...?

## రిటైర్మెంట్‌పై అశ్విన్ సెన్సేషనల్ కామెంట్స్!

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ఐపీఎల్ రిటైర్మెంట్‌పై సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. 2025 ఐపీఎల్ సమయంలో తాను మానసికంగా అలసిపోయానని లేదంటే లీగ్‌లో మరికొంత కాలం ఆడి ఉండేవాడినని అశ్విన్ పేర్కొన్నాడు. తాజాగా చెన్నై- ఆర్సీబీ మధ్య జరిగిన మ్యాచ్‌ను తన యూట్యూబ్ ఛానెల్‌లో మాజీ క్రికెటర్ విమల్ కుమార్‌తో అశ్విన్ విశ్లేషించాడు. ఈ మేరకు ఈ వ్యాఖ్యలు చేశాడు.'నేను ఈ మ్యాచ్ (ఆర్సీబీ–సీఎస్కే)ను న్యూట్రల్ పాయింట్ ఆఫ్ ది వ్యూలోనే చూశాను. కానీ, ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. గత సీజన్ చెన్నైకి కలిసిరాలేదు. అది వ్యక్తిగతంగా నాకు కూడా తీవ్రంగా నిరాశ కలిగించింది. ఆ సమయంలో నేను ఇంకా మరిన్ని సీజన్లు ఆడగలను అనిపించింది. కానీ, నేను ఎమోషనల్‌గా అలసిపోయాను. అందుకే ఇకపై ఆడకూడదని నిర్ణయం తీసుకున్నాను' అని అన్నాడు. ఒకవేళ గత సీజన్ సీఎస్కేకు బాగా జరిగి ఉంటే ఈ సీజన్‌లో బరిలోకి దిగేవాడివా అని విమల్ అడిగాడు. దీనికి అశ్విన్, 'నేను ఆ విషయం గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అది మానసికంగా కలవరపెడుతుంది. నా పరంగా ఆ సీజన్ నన్ను బాగా నిరాశ పర్చింది. అందుకే ఇక ఆడకూడదు అనుకున్నా. దీనిపై నేను చర్చించుకున్నాను. అయితే నా ఐపీఎల్ కెరీర్ చెన్నైతోనే మొదలైంది. ఈ కెరీర్‌ను నా సొంత



సిటీలో చెన్నైతోనే ముగించాలనుకున్నా. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' 'అలాగే నేను రిటైర్ అయిపోతే ఫ్రాంచైజీకి కూడా నా వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. నన్ను జట్టులో రిటైన్ చేసుకోవాలా లేదా వదిలేయాలా అనే కన్ఫ్యూజన్ ఉండదు. నేను రిటైరైతే సీఎస్కేకు రూ.10 కోట్లు మిగులుతాయి. ఆ డబ్బుతో వేలంలో మరికొంతమంది ప్లేయర్లను కొనుగోలు చేసి జట్టును బలంగా చేసుకోవచ్చని ఆలోచించాను' అని అశ్విన్ తన రిటైర్మెంట్ వెనకున్న కారణాన్ని వెల్లడించాడు. కాగా, అశ్విన్ 2024లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. ఆ తర్వాత 2025 ఐపీఎల్‌లో సీఎస్కే తరఫున ఆడాడు. 2025 మెగా వేలంలో అశ్విన్‌ను చెన్నై రూ.9.75 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఆ సీజన్‌లో అశ్విన్‌కు తక్కువ అవకాశాలు లభించాయి. మొత్తం 14 మ్యాచ్‌ల్లో అశ్విన్ 9 మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగాడు. ఏడు వికెట్లు తీశాడు. ఇక అదే ఏడాది ఆగస్టులో ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించి షాకిచ్చాడు. ఇక అశ్విన్ 2009లో చెన్నై తరఫునే ఐపీఎల్ కెరీర్ ప్రారంభించాడు. కెరీర్ మొత్తంలోచెన్నై, పుణె, పంజాబ్, దిల్లీ, రాజస్థాన్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 17ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అశ్విన్ మొత్తం 239 మ్యాచ్‌ల్లో 201 వికెట్లు పడగొట్టాడు. ఇక ప్రస్తుత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు. ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడగా మూడింట్లోనూ సీఎస్కే ఓడిపోయింది. తొలుత రాజస్థాన్‌తో మ్యాచ్‌లో ఓటమి చెందగా, తర్వాత వరుసగా పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ జట్లపై పరాజయం చవిచూసింది. దీంతో పాయింట్ల పట్టికలో సీఎస్కే 10వ స్థానానికి పడిపోయింది. ఇక ఏప్రిల్ 11 (శనివారం) చెన్నై నాలుగో మ్యాచ్ ఆడాల్సి ఉంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్‌తో సీఎస్కే ఆడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా విజయం సాధించి టోర్నీలో బోణీ కొట్టాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# భువనేశ్వర్ కుమార్ సరికొత్త రికార్డు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఒక అద్భుతమైన మైలురాయి నమోదైంది. 'స్వింగ్ కింగ్'గా పేరొందిన భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఆదివారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ ఈ అరుదైన ఘనతను సాధించారు. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్ల మార్కును అందుకున్న తొలి భారతీయ వేగవంతమైన బౌలర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ పోరులో భువనేశ్వర్ కుమార్ తన పాత ఫామ్‌ను గుర్తుకు తెచ్చారు. ఈ మ్యాచ్‌లో ఆయన 3 కీలక వికెట్లు పడగొట్టి చెన్నై బ్యాటింగ్ వెన్నెముకను విరిచారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో తన స్వింగ్‌తో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన భువీ, ఐపీఎల్‌లో తన 200వ వికెట్‌ను సాధించి స్టేడియంను హోరెత్తించారు. ఈ ఘనత సాధించిన సమయంలో మైదానంలోని ఆటగాళ్లు, ప్రేక్షకులు ఆయనకు ఘనంగా అభివాదం చేశారు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 200 వికెట్ల మార్కును దాటిన బౌలర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. యజువేంద్ర చహల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్‌లో చేరారు. అయితే, ఒక పేసర్‌గా ఈ మైలురాయిని అందుకోవడం భువీకి దక్కిన ప్రత్యేక గౌరవం. గతంలో లసిత్ మలింగ (170) వంటి దిగ్గజ పేసర్లు కూడా ఈ మార్కును అందుకోలేకపోయారు. భువనేశ్వర్ కుమార్ కెరీర్‌లో మెజారిటీ భాగం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతోనే సాగింది. ఎన్నో ఏళ్లపాటు ఆ జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఉండి, రెండుసార్లు 'పర్పుల్ క్యాప్' (అత్యధిక వికెట్లు తీసిన బౌలర్) గెలుచుకున్న ఏకైక భారతీయ బౌలర్‌గా నిలిచారు. 2026 మెగా వేలంలో ఆర్‌సీబీ ఆయనను సొంతం చేసుకోగా, కొత్త జట్టులో కూడా తన విలువేంటో భువీ నిరూపించుకున్నారు. ఈ అద్భుత ఘనతపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆర్‌సీబీ కెప్టెన్ మాట్లాడుతూ, "భువీ ఒక లెజెండ్. ఆయన అనుభవం జట్టుకు ఎంతో ప్లస్ అవుతుంది. 200 వికెట్లు తీయడం సామాన్యమైన విషయం కాదు, అది కూడా ఒక పేసర్‌గా చిన్నస్వామి వంటి స్టేడియాల్లో ఆడటం గర్వకారణం" అని కొనియాడారు. సోషల్ మీడియాలో కూడా 'భువీ 200' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. 36 ఏళ్ల వయస్సులో కూడా భువనేశ్వర్ కుమార్ తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ యువ బౌలర్లకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన స్వింగ్ బౌలింగ్ ఇంకా చెక్కుచెదరలేదని ఈ రికార్డు నిరూపిస్తోంది. రాబోయే మ్యాచ్‌లలో ఆయన మరిన్ని వికెట్లు పడగొట్టి తన రికార్డును మరింత పటిష్టం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# సంజూ రాకతో సీఎస్‌కేకి శని పట్టుకుందా..?



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి ఏమీ బాగోలేదు. వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. అయితే, ఈ ఓటముల కంటే ఇప్పుడు సీఎస్‌కే అభిమానులను ఎక్కువగా బాధిస్తున్న విషయం.. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఫామ్. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాల మధ్య ట్రేడింగ్ ద్వారా చెన్నైలోకి అడుగుపెట్టిన సంజూ, వరుసగా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కావడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. మొన్నటి టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను తన బ్యాటింగ్‌తో భయపెట్టిన సంజూ, ఇప్పుడు ఐపీఎల్‌లో మాత్రం చేతులెత్తేస్తున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన మొదటి మూడు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు వరుసగా 6, 7, 9. అంటే మొత్తం మీద మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 22 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ గెలిచిన ఊపులో ఐపీఎల్‌ను ఊపేస్తాడని భావించిన అభిమానులకు సంజూ ఆటతీరు తీవ్ర నిరాశను కలిగిస్తోంది. సంజూ కేవలం పరుగులు చేయకపోవడమే కాదు, మైదానంలో అతని ప్రవర్తన కూడా చర్చనీయాంశంగా మారింది. చెన్నై జెర్సీలో సంజూ అస్సలు సంతోషంగా కనిపించడం లేదని, ఏదో అయిష్టంగా ఆడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్‌గా సంజూలో ఉన్న ఆ కసి, ఆకలి ఇప్పుడు చెన్నైలో కనిపించడం లేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజూ త్వరగా అవుట్ కావడంతో సోషల్ మీడియాలో స్టెప్ అసైడ్ సంజూ(సంజూ తప్పుకో) అనే హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. ఒక చెన్నై అభిమాని ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.

# గాయపడ్డ సింహం.. ఓ మంచి పాత్రలో కనిపిస్తా

## నటుడు జెడి చక్రవర్తి



కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# 15 ఏళ్లకే ఆ నరకం చూశాను

## : డీప్‌ఫేక్ ఫొటోలపై జాన్వీ కపూర్



టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న నటి జాన్వీ కపూర్, తన టీనేజ్ రోజుల్లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని పంచుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన జాన్వీ, టెక్నాలజీ దుర్వినియోగం వల్ల తాను ఎదుర్కొన్న మానసిక వేదనను బయటపెట్టింది.

స్కూల్ రోజుల్లో జాన్వీకి కేవలం 15 ఏళ్లు ఉన్నప్పుడు, ఆమె ఫొటోను సాంకేతికతతో అసభ్యకరంగా మార్చి ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. తన స్నేహితురాలు ఆ ఫొటోను చూపించే వరకు తనకు విషయం తెలియదని, అది చూసి ఏం చేయాలో పాలుపోక ఎంతో ఏడ్చానని ఆమె ఎమోషనల్ అయింది. సోషల్ మీడియాలో నైతికత ఉండదని ఆ చిన్న వయసులోనే తనకు అర్థమైందని, భవిష్యత్తులో ఇలాంటివి ఎదుర్కోవడానికి అప్పుడే మానసిక ధైర్యాన్ని పెంచుకున్నానని తెలిపింది.

ఇప్పుడు తనపై వచ్చే నెగటివ్ కామెంట్లను లేదా మార్ఫింగ్ ఫొటోలను పెద్దగా పట్టించుకోనని జాన్వీ స్పష్టం చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఇలాంటి సవాళ్లు తప్పవని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడమే మార్గమని ఆమె యువతకు సూచించింది. కెరీర్ విషయానికి వస్తే... 'దేవర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఆమె బిజీగా ఉంది.





# రాకాసకు మంచి ఓపెనింగ్స్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే నిర్మాతగా 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, సపోర్టింగ్ క్యాస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలిసి సినిమాకు మంచి ప్లస్ అయ్యాయి. ముఖ్యంగా హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'రాకాస' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి జోరు చూపిస్తూ, నిహారిక కొణిదెలను విజయవంతమైన నిర్మాతగా మరోసారి నిలబెడుతోంది.

# అనిల్ రావిపూడికి దిల్ రాజు బంపర్ ఆఫర్!


తన తదుపరి మల్టీస్టారర్ సినిమా హీరోయిన్ ఎంపికపై వస్తున్న ఊహాగానాలకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరదించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ హీరోలుగా తాను తెరకెక్కిస్తున్న చిత్రంలో కృతిశెట్టిని ఓ కథానాయికగా తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న కథనాలకు స్పష్టత లభించినట్లయింది.

ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, అనిల్ రావిపూడిలో మంచి నటుడు ఉన్నాడని, అవకాశం వస్తే తానే హీరోగా పరిచయం చేస్తానని అన్నారు. దిల్ రాజు ఆఫర్‌పై అనిల్ రావిపూడి స్పందిస్తూ.. "దిల్ రాజు గారి ఆఫర్ బాగుంది. కానీ, ఇప్పట్లో నటించే ఆలోచన లేదు. ఆయన నిర్మాతగా ప్రదీప్ హీరోగా సినిమా తీస్తే నేను డైరెక్ట్ చేస్తాను" అని చమత్కరించారు. ఇదే వేదికపై తన కొత్త సినిమా హీరోయిన్‌పై స్పష్టత ఇచ్చారు. "మా సినిమాలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే చాలా రూమర్లు వచ్చాయి. వాటన్నింటికీ ఇప్పుడు చెక్ పెడుతున్నా" అని తెలిపారు. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' హీరో ప్రదీప్ రంగనాథన్‌ను అనిల్ రావిపూడి ప్రశంసించారు. ప్రదీప్ హీరోలా కాకుండా మనలో ఒకడిలా ఉంటాడని, అందుకే ప్రేక్షకులు ఆయనను అంతగా ఆదరిస్తున్నారని కొనియాడారు. కాగా, 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం ఏప్రిల్ 10న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.





# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ




రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.